నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శనివారం 22 మార్చి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

### కొత్త రేషన్‌కార్డు రాలే..



మాకు రేషన్‌కార్డు లేకపోవడంతో కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. మూడు, నాలుగు సార్లు ఆన్‌లైన్‌లో అప్లై చేసినా.. అధికారులకు దరఖాస్తు చేసుకున్నా కార్డు మంజూరు కాలేదు. అధికారులను అడిగితే వస్తదని చెబుతున్నారు.. కొంత మందికి ఎమ్మెల్యే ప్రొసీడింగ్‌లు ఇచ్చినా.. మిగితా వారికి ఇవ్వలేదు.. అసలు వస్తదో లేదో తెలియని పరిస్థితి.

**- ఆంజనేయులు, ఇబ్రహీంబాద్, హన్వాడ మండలం, మహబూబ్‌నగర్**

### ముగ్గు పోయకపోవడంతో గుడిసెలోనే ఉంటున్నా..



ఇందిరమ్మ ఇల్లు వచ్చిదంటే ఎంతో సంతోషపడ్డా.. కానీ ఇల్లు నిర్మాణం కోసం అధికారులు ముగ్గుపోస్తారని చెబుతున్నారు.. కానీ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు ముగ్గు పోస్తారో.. తెలియని పరిస్థితి. ఇల్లు లేకపోవడంతో ఇప్పుడు గుడిసెలోనే జీవనం గడుపుతున్నాం. త్వరగా ఇల్లు నిర్మిస్తే బాగుంటుంది. మాకు ఇచ్చిన ఇంటి ప్రొసీడింగ్‌పై కలెక్టర్ సంతకంలేదు.

**- జ్యోతి, ఇబ్రహీంబాద్, హన్వాడ మండలం**



ఇంటి నిర్మాణానికి ముగ్గు పోయకపోవడంతో ఖాళీ స్థలంలో దిగాలుగా లబ్ధిదారురాలు

### నాకు ఇందిరమ్మ ఇల్లు కావాలి

నాగర్‌కర్నూల్ మండలం నాకు ఉన్న పాత ఇల్లు కూలి పోయింది. ఇద్దరు కొడుకులతో పూరిగుడిసెలో ఉంటున్నారు. మా గ్రామంలో ఇండ్లు వస్తాయని అధికారులు చెప్పిండ్రు. ఇప్పుడేమో మా పెద్ద కొడుక్కి మాత్రమే ఇల్లు వచ్చిందంటున్నరు. నాకు తర్వాత వస్తదని చెబుతున్నరు.. కానీ నమ్మకం లేదు. వాన పడితే పూరి గుడిసెలో ఉండడానికి ఇబ్బందులు పడుతున్నా. నాకూ ఇందిరమ్మ ఇల్లు ఇయ్యాలె.

**- దేవమ్మ, పెద్దాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా**



పెద్దాపూర్‌లో గుడిసె ఎదుట దిగాలుగా కూర్చున్న దేవమ్మ (కుడివైపు)

- పైలట్ గ్రామాల్లో సంక్షేమం అంతంతే
- కానరాని వందశాతం పథకాల జాడ
- ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనా గుడిసెలో ఉంటున్న లబ్ధిదారులు
- రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు



గుడిసె ఎదుట మంజూరైన ఇంటి ప్రొసీడింగ్‌తో జ్యోతి

# ఆదర్శం.. అరకొరే..!

నాగర్‌కర్నూల్, మార్చి 21 : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఆర్భాటంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రుణమాఫీ, కొత్త పింఛన్లు, నూతన రేషన్ కార్డులు అర్హులకంటే అనర్హులైన అధికార పార్టీ నాయకులకే వందశాతం అమలైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్కీములను అమలు చేసేందుకు మండలానికో పైలట్ గ్రామాన్ని జనవరి 26వ తేదీన ఎంపిక చేశారు. మంజూరుచేసే అభివృద్ధి పథకాలను వివరిస్తూ గ్రామసభలు కూడా నిర్వహించారు. కొన్ని చోట్ల జాబితాలు ఎంపిక చేసి అర్హుల పేర్లు ప్రకటించారు. పథకాల్లో అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని, అర్హులకు మోసం చేశారని, ఇల్లు ఉన్న వారికే ఇల్లు మంజూరు చేశారనే వివిధ రకాల కారణాలు చూపుతూ ప్రజలు గొడవకు దిగిన విషయం తెలిసిందే. అప్పట్లో అధికారులు చేసేది లేక దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఆలస్యమైనా పథకాలు అందుతాయనే హామీతో సమావేశాలను ముగించారు. ఇక తర్వాత తాము ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందవచ్చని అంతా అనుకున్నారు. కానీ ఎంపిక చేసిన గ్రామాల్లో పథకాల అమలు అటకెక్కింది.

**పథకాల అమలు అసంపూర్తిగా..**

పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో పథకాలు పూర్తి స్థాయిలో అమలు పరచడం అధికారులకు తలనొప్పిగా మారింది. ఒక్కో ఇంట్లో ఇద్దరు ముగ్గురు అర్హులు ఉంటే ఒకరికే పథకం వర్తింపజేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నాగర్‌కర్నూల్ మండలం పెద్దాపూర్‌లో ఇలాంటి సమస్యే ఎదురవుతోంది. ఒక ఇంట్లో ఇందిరమ్మ ఇల్లు పొందేందుకు ముగ్గురు ఉంటే ఒకరికే మొదటి విడుతగా ఇస్తుండడంతో మిగతా అర్హులైన ఇద్దరు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకాలు అందరికీ అందుతాయనుకున్న ఈ గ్రామస్తులకు నిరాశే మిగిలింది. గ్రామం మొత్తంలో 41 మందికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగా ఇద్దరున్న ఇంట్లో ఒకరికి మాత్రమే మొదటి విడుతగా ఇల్లు వస్తుందని చెప్పడంతో మిగతా వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ భరోసాకు ఏడాదికి రూ.12 వేలు పొందేందుకు కేవలం ఏడుగురు మాత్రమే ఎంపికయ్యారు. ఇందుకు ఉపాధి పథకంలో పనిచేస్తూ భూమిలేని అర్హులను ఎంపిక చేసేందుకు మెలిక పెట్టడంతో ఈ పథకం ద్వారా లబ్ధిపొందే అర్హులు పూర్తిగా తగ్గిపోయారనే చెప్పవచ్చు. ఇక రైతు భరోసా ఎకరానికి రూ.6 వేల చొప్పున ఇస్తున్న పెట్టుబడి సాయం కూడా అంతంత మాత్రంగానే అందుతుందని రైతులు నిరాశతో ఉన్నారు. కొత్తరేషన్ కార్డులకోసం ఇప్పటికి 30 కుటుంబాలను గుర్తించినా అవి అందకపోగా, ఇంకా మీసేవ, గ్రామసభల ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కొత్త కార్డులు అందలేదు. ఉన్న కార్డుల్లో తమ పిల్లల పేర్లను చేర్చడంలో తాత్సారం జరుగుతోంది. ఇప్పటికీ చాలా మంది పాత రేషన్ కార్డుదారుల్లో కొత్త వారి పేర్లు చేర్చకపోవడం ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు. ఏదేమైనా పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లోనే అభివృద్ధి కొరవడడం, పథకాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందకపోవడంపై మిగతా గ్రామాల్లో అర్హుల పరిస్థితి రాబోయే రోజుల్లో ఎలా ఉంటుందనేది ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా సర్పంచుల పదవీ కాలం పూర్తవడంతో గ్రామాల్లో పారిశుధ్య లోపం కనిపించింది. పలు వీధుల్లో డ్రైనేజీలు చెత్తతో నిండుకున్నాయి. పండుగొస్తేనే డ్రైనేజీలు తీస్తారని స్థానికులు పేర్కొనడం విశేషం. కురువ గేరిలో నిర్మించిన శ్మశాన వాటిక వాడుకలో లేక, భద్రత లేక పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నది. ఏడాది కిందట ప్రారంభించిన ఈ వాటికకు ఆలనాపాలన కరువైంది.

### పెద్దాపూర్‌లో పూర్తిస్థాయిలో అమలుకాని స్కీమ్‌లు

# అటకెక్కిన పథకాలు!

హన్వాడ, మార్చి 21 : ఆరు గ్యారెంటీలలో భాగంగా నాలుగు పథకాలు అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికో పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసింది. జనవరి 26వ తేదీన ఆర్భాటంగా రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను వంద శాతం చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హన్వాడ మండలంలో ఇబ్రహీంబాద్‌ను సెలెక్ట్ చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయితోపాటు ఉన్నతాధికారులు ప్రారంభించారు. ప్రారంభానికి రోజు ముందుగా పబ్లిసిటీ కోసం 5 నుంచి 10 మందికి ఇండ్ల పత్రాలు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పత్రాలను అందజేశారు.

**వందశాతం అమలేదీ?**

ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామంలో నాలుగు పథకాల అమలు ఎక్కడా కనిపించడం లేదు. 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా పరిస్థితి తయారైంది. ఇబ్రహీంబాద్‌లో 10 వార్డులకుగానూ జనాభా 1,697, ఓటర్లు 1,426 మంది ఉన్నారు. 391 మంది ఇండ్లకు దరఖాస్తులు చేసుకోగా 97 మందికి మంజూరయ్యాయి. కానీ ఐదు నుంచి 10 మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ అందించారు. అలాగే 159 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటే 101 మందికి వచ్చాయి. వచ్చినా కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. దీంతో ఎప్పుడు ఇస్తారా..? అని ఎదురుచూస్తున్నారు. గ్రామంలో ఏడుగురికి మత్రమే ఇందిరమ్మ భరోసా కింద రూ.6 వేల చొప్పు న డబ్బులు జమ చేశారు. ఇక భూమిలేని వారు ఉన్నారు. రైతుభరోసా కింద మూడు రెవెన్యూ గ్రామాలకు కలిపి మొత్తం 580 మంది రైతులకు రూ.3.80 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని అధికారులు తెలిపారు. అయితే నాలుగు పథకాల అమలు మాత్రం శూన్యం. ప్రభుత్వం గ్యారెంటీలు అమలు చేస్తున్నామని గొప్పలు చెబుతున్నా.. పైలట్ గ్రామాల్లో ఎక్కడా అమలు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ముగ్గు పోయక గుడిసెల్లోనే లబ్ధిదారులు**

ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అధికారులు లబ్ధిదారుల పేర్లు వెల్లడించడంతో సంతోషంతో వారు ఉంటున్న నివాసాలను తొలగించారు. ఇండ్ల నిర్మాణం కోసం ముగ్గుపోసినా.. నేటికీ ఇంకా గుడిసెల్లోనే జీవనం గడుపుతున్నారు. అప్పుడు.. ఇప్పుడు.. అంటూ అధికారులు చెబుతున్నారని పలువురు వాపోయారు. లబ్ధిదారులకు ఇండ్ల ప్రొసీడింగ్‌లు అందించినా వాటిపై కలెక్టర్ సంతకంలేదు. ప్రొసీడింగ్ నెంబర్లు వేయలేదు.. ఇంతకు ఇండ్లు మంజూరు అయ్యాయా..? లేదా..? అన్న అయోమయంలో ఉన్నారు.



ఇబ్రహింబాద్‌లో కొత్త ఇంటి నిర్మాణం కోసం పాత ఇల్లును కూల్చుకున్న ఆంజనేయులు

# నిబంధనలకు విరుద్ధంగా..!

- దేవుడి మాన్యంలో ఇందిరమ్మ ఇండ్లకు మార్కింగ్
- ఇండ్లు లేని వారికి మంజూరు కాలేదని పలువురి ఆరోపణ

అలంపూర్, మార్చి 21 : కాంగ్రెస్ పాలనలో అర్హులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. వడ్డించేటోడు మనోడైతే బంతిలో ఏ చివరన కూర్చున్నా మన వాటా మనకు దక్కుతుందన్నట్టు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వాడికే ప్రజా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత జనవరి 26 వ తేదీన ప్రభుత్వం లాంఛనంగా ప్రజా సంక్షేమ పథకాలను మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్రకటించిన విషయం విధితమే. అర్హులను ప్రకటించిన మొదటి రోజు గ్రామ సభలోనే అర్హుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ అప్పట్లో గందరగోళం నెలకొన్నది. ప్రకటించిన జాబితాలో పేర్లు లేని అర్హులైన వారిని మభ్య పెట్టేందుకు అధికారులు మరోసారి దరకాస్తులు స్వీకరించారు. జాబితాలు సిద్ధం చేసి 50 రోజులు పూర్తవుతున్నా నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అలంపూరు మండలం గుందిమల్ల గ్రామం మొదట ఈ గ్రామాన్ని ఎంచుకుని ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 391 ఇండ్లకుగానూ 1433 మంది జనాభా ఉన్నారు.

వారిలో 1320 మంది ఓటర్లు ఉండగా అందులో 650 మంది పురుషలు, 670 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. నాలుగు పథకాల్లో అర్హుల జాబితా ప్రకారం అత్మీయ భరోసా పథకంలో 67మందిని గుర్తింగా 5 మంది దరఖాస్తులు రిజెక్ట్ కాగా 61మందిని ఫైనల్ చేశారు. రైతు భరోసా పథకంలో 745 హెక్టార్లకు గానూ 329 మంది రైతులను గుర్తించారు. రేషన్ కార్డుల కోసం 61 మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో 42మందిని గుర్తించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి 391 దరఖాస్తులు రాగా వారిలో 379కుటుంబాలను సర్వే చేశారు. వారిలో లిస్టు 1లో 69మంది, లిస్టు-2లో 3 , లిస్టు-3లో 14 మందిని మొత్తం 86 మందిని అర్హులుగా గుర్తించారు.



అర్హులకు న్యాయం చేయాలని ఎంపీడీవోతో మాట్లాడుతున్న బాధితులు

### అనర్హులకే పథకాలు ఇచ్చారు..



అధికారులు అధికార పార్టీకి తలొగ్గి అర్హులకు కాకుండా అనర్హులకే సంక్షేమ పథకాలు ఇస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామ శివారులో ఉన్న 199 సర్వే నెంబర్‌లో దేవుడి మాన్యం భూముల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ముగ్గులు పోశారు. ఇంటి స్థలాలు ఉన్న వారిని గుర్తించకుండా అధికార పార్టీ వారికే లిస్టులో పేరుంది. దేవుడి మాన్యాలను కాపాడలని అధికారులను కోరాం. నిజమైన అర్హులకు న్యాయం చేయాలని కోరాం.

*-రఫీ, గుందిమల్ల, అలంపూర్ మండలం*

### దేవుడి మాన్యంలో ఇండ్లకు మార్కింగ్



ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అర్హులుగా గుర్తించిన వారికి ప్రభుత్వం కొత్తగా ఇంటి స్థలాలు ఇవ్వకుండా గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూముల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అధికారులు మార్కింగ్ వేయిస్తున్నారు. దీంతో గ్రామస్తులు మాన్యం భూమిలో ఇండ్ల నిర్మాణాలు ఎంటీ.. అని వాటి నిలుపుదల కోసం అధికారులను సంప్రదించాం. మాన్యం భూములను కాపాడాలని వినతి పత్రాలు సమర్పించాం.

*-లక్ష్మణ్‌నాయుడు, గుందిమల్ల, అలంపూర్ మండలం*

### తప్పిదాలు లేకుండా అర్హులకు న్యాయం చేస్తాం..

ప్రజా సంక్షేమ పథకాల్లో వీలైనంత వరకు నిజమైన అర్హులకే న్యాయం చేస్తాం. ఎక్కడైనా అనుకోకుండా తప్పిదాలు జరిగి ఉంటే గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు జాబితాను సరి చేసే ప్రయత్నం చేస్తాం. పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి న్యాయ పరంగా సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తాం.

**- ఎంపీడీవో పద్మావతమ్మ**

# కేసీఆర్ హయాంలో మైనార్టీలకు పెద్దపీట

- మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, మార్చి 21 : రాష్ట్రంలో మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేసి మైనార్టీల అభివృద్ధికి పాటుపడింది కేసీఆర్ సర్కారేనని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పవిత్రరంజాన్ మాసంలో భాగంగా శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ ఇర్ఫాన్ అన్వర్ హుస్సేన్ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా మసీదులో ముస్లిం పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లింలకు పండు తినిపించి రోజా విడిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం కల్పించారని గుర్తు చేశారు. అదేవిధంగా షాదీ ముబారక్ పథకాన్ని తీసుకువచ్చిన మైనార్టీ ఆడబిడ్డ పెండ్లికి రూ.1,00,116 ఆర్థిక సాయం అం దించి ఆదుకున్నారని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నా యకులు శ్రీనివాస్‌గుప్తా, రాజుల ఆశిరెడ్డి, చిన్న హనుమంతు, అన్వర్‌హుస్సేన్, మై మూద్, మన్నాన్, సాదిక్, రాజు, ఈశ్వర్‌యాదవ్, రాజు, సాగర్, ముస్లిం మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.



మక్తల్ : ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



నిజాలాపూర్‌కు వస్తున్న కేఎల్ఐ నీరు

# నిజాలాపూర్‌కు కేఎల్ఐ నీళ్లు..

నమస్తే ఎఫెక్ట్

మూసాపేట, మార్చి 21 : మండలంలోని నిజాలాపూర్ గ్రామానికి కేఎల్ఐ నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండుతున్నాయని 'నమస్తే తెలంగాణ' ఈ నెల 13వ తేదీన 'రైతున్న వరి గోస' అనే కథనంతో రైతులు పడుతున్న ఇబ్బందులను, కేఎల్ఐ నీళ్లు రాకుంటే సూమారుగా 300 ఎకరాల వరకు వరి పంట ఎండుతుందని తెలియజేస్తూ వెలుగులోకి తీసుకొచ్చిన విషయం పాఠకులకు విధితమే. రైతులు కూడా స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిని కలిసి వారి సమస్యను వివరిస్తూ పంటలు ఎండుతున్నాయని, సాగునీరు రాకుంటే ఇబ్బందులు పడుతామని చెప్పడంతో ఎమ్మెల్యేలు స్పందించి సాగునీటిని విడుదల చేయించారు.

## మాకే పరిహారం చెల్లించాలి

- తమకంటే తమకే ఇవ్వాలని పట్టుపట్టిన రైతులు, ఆలయ అధికారులు



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో

చారకొండ, మార్చి 21: నార్లాపూర్-డిండి ఎత్తిపోతల పథకంలో కాలువలో కోల్పోయిన భూములకు ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న తమకే పరిహారం చెల్లించి ఆదుకోవాలని కల్వకుర్తి ఆర్డీవో శ్రీనును రైతులు కోరారు. శుక్రవారం కమాల్‌పూర్‌లో భూ పరిహారంపై గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని కమార్‌పూర్‌లో సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామికి ఆలయానికి చెందిన 51.32 ఎకరాలు కాల్వ నిర్మాణంలో కోల్పోతున్నాయి. ఎకరాలకు రూ. 5.30లక్షలు చొప్పు న ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. దేవాలయంపైనే పట్టా ఉందని, తమకే పరిహారం చెల్లించాలని ఆలయ అధికారులు పట్టుపట్టారు. తాము 1954 నుంచి తామే సాగు చేస్తున్నామని తమకు పరిహారం ఇవ్వాలని రైతులు అధికారులకు కోరారు. దీంతో రైతులు ఎన్ని ఏళ్ల నుండి సాగు చేస్తున్నారు.. ఎంత సాగు చేస్తున్నారో అనే వివరాలను తాసీల్దార్‌కు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో రైతులకు సూచించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాసీల్దార్ సునీ త, దేవాదాయ శాఖ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి, దేవాదాయ తాసీల్దార్ గిరిధర్, ఆలయ చైర్మన్ రామశర్మ, ఈవో ఆంజనేయులు, మేనేజర్ నిరంజన్, డీఎల్ఐ ఏఈ సుభాషిణి, ఆర్ఐ భరత్, మాజీ జెడ్పీటీసీ భీముడునాయక్, నర్సింహారెడ్డి, లక్ష్మణ్‌శర్మ, రైతులు పాల్గొన్నారు.

# మిస్టరీ వీడని శ్రీధర్‌రెడ్డి హత్య

- ఘటన జరిగి పదినెలలైనా హంతకుల జాడేదీ?
- కొలిక్కిరాని పోలీసుల విచారణ
- మరుగునపడ్డ మర్డర్
- న్యాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు

వనపర్తి, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : చిన్నంబాయి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి పది నెలలు గడిచింది. ఇప్పటి వరకు హంతకుల జాడ లేకపోవడంతో అందరూ పోలీసుల వైపే చూస్తున్నారు. రాష్ట్రస్థాయిలో రాజకీయ హత్యగా చర్చకు దారితీసిన ఈ ఘటన పోలీసులకు విచారణలో సవాల్‌గా నిలుస్తుంది. నెలలు గడుస్తున్నా.. తమకు ఇంకెప్పుడు న్యాయం చేస్తారంటూ బాధిత కుటుంబం బావురుమంటున్నది. సాయం కోసం..కేసు పురోగతికై వివిధ రాజకీయ పక్షాలను, పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయిస్తూ తమకు న్యాయం చేయమని బాధితులు పదే.. పదే ప్రాదేయపడుతూనే ఉన్నారు.

చిన్నంబాయి మండలం లక్ష్మీపల్లిలో 2024 మే 22న అర్ధరాత్రి తన ఇంటిపక్క కల్లం (దొడ్డి)లో నిద్రిస్తున్న శ్రీధర్‌రెడ్డి హత్యకు గురైన సంగతి విధితమే. హత్య జరిగి నేటితో పది నెలల అవుతున్నది. ఈ ఘటనపై విచారణలో ఇంకా పురోగతి రాలేదు. కుటుంబ సభ్యులు ఇది రాజకీ య హత్య అని ముక్త కంఠంగా పోలీసులకు ముందు నుంచి చెబుతూ వస్తున్నారు. ఈ ఘటనలో అనేక మందిని పోలీసులు విచారణ జరుపుతూనే ఉన్నారు. స్నేహితులు, రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీలు, ఆర్థికపరమైన సంబంధాలు, రాజకీయ ప్రత్యర్థులు, చివరకు సొంత పార్టీ నాయకులను సహితం పోలీసులు విచారణ చేస్తూ వచ్చారు. ఈ హత్యలో పోలీసులకు తగిన బలమైన సాక్షాల అన్వేషణ ప్రధాన సమస్యగా మారింది.

**ఎన్ని విజ్ఞప్తులు చేసినా...**

బాధిత కుటుంబ సభ్యులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రాష్ట్ర స్థాయి పోలీసు అధికారులకు అనేక దఫాలుగా కేసును ఛేదించాలని విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. శ్రీధర్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకుడైనప్పటికీ కుటుంబ సభ్యులు బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్ నాయకులను కలిసి మొరపెట్టుకున్నారు. బీజేపీలో బండి సంజయ్, డీకే అరుణలతో పాటు మరికొంతమంది నాయకుల దృష్టికి హత్య ఘటనను తీసుకెళ్లి న్యాయం చేయమని కోరారు. అలాగే ప్రజాభవన్‌కు వెళ్లి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని కలిసి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు కేసు డీలా కావడంపై హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. వీటన్నిటి దృష్ట్యా అప్పట్లో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ గత జూలై 17న లక్ష్మీపల్లి గ్రామాన్ని సందర్శించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వీరి పర్యటనతో త్వరలోనే న్యాయం జరుగుతుందని కుటుంబ సభ్యులు ఆశించారు. ఇక బీఆర్‌ఎస్ ముందు నుంచి బాధితుల పక్షాన నిలబడింది. రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వరకు కేసులో జరుగుతున్న డీలాను ఎప్పటికప్పుడు పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా రు. జనవరి 20న ఎస్పీ రావుల గిరిధర్‌ను కలిసి కేసులో హంతకులను గుర్తించాలని మరోసారి బీరంతోపాటు చిన్నంబాయి మం డల నాయకులు విజ్ఞప్తి చేశారు. అయినా ఈ కేసులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.



లక్ష్మీపల్లిలో హత్యకు గురైన శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

**ధర్నాలు చేసినా...**

శ్రీధర్ రెడ్డి హత్య కేసు ఛేదించడంలో డీలా జరుగుతుందని ధర్నాల వరకు దారి తీసింది. కుటుంబ సభ్యుల ఆవేదనతో జనవరిలో బీజేపీ నాయకులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు చిన్నంబాయి మండలంలో ధర్నా చేపట్టారు. నెలలు గడుస్తున్నా.. ఎందుకు మర్డర్ కేసులో హంతకులను పట్టుకోవడం లేదన్న నాయకుల ప్రశ్నలకు పోలీసుల నుంచే సమాధానాలు రావాలి. లక్ష్మీపల్లిలో జరిగిన దారుణ హత్యపై ముందు నుంచి మెజార్టీ రాజకీయ పక్షాలు ఐక్యంగా ఉన్నాయి. ఇలా వివిధ రాజకీయ పక్షాలు శ్రీధర్‌రెడ్డి హత్యపై డేగ కన్నుతో పరీక్షిస్తున్నాయి. కావాలని కేసును ఒత్తిళ్లతో డీలా చేస్తున్నారన్న వాదనలతో పదే పదే రాష్ట్ర పోలీసు అధికారులను కలుస్తూ హంతకులను పట్టుకోవాలని విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు.

**పోలీసులకు సవాల్‌గా...**

శ్రీధర్‌రెడ్డి హత్యలో పురోగతి లేకపోవడంపై పోలీసులకు సవాలుగానే నిలుస్తున్నది. రాజకీయంగా అనేక వాదనలున్నప్పటికీ చివరకు పోలీసులదే ప్రధాన పాత్ర అయినందునా వారిపైకి దృష్టి వెళ్తుంది. పోలీసులు సైతం కేసును ప్రాధాన్యతగా తీసుకున్నప్పటికీ హంతకులను పట్టుకోవడంలో మాత్రం సఫలం కాలేకపోతున్నారు. కేసు విచారణలో ఎదురవుతున్న సవాళ్లు.. ప్రతిసవాళ్లను అధిగమించి పురోగతి సాధించాల్సి ఉంది. హంతకులను ఇంకా ఎప్పుడు పట్టుకుంటారన్నట్లు లక్ష్మీపల్లి గ్రామం అమాయకంగా ఎదురు చూస్తుంది. శ్రీధర్‌రెడ్డిని ఎందుకు హత్య చేశారు.. ఎవరు చేశారు అన్న ప్రశ్నలు మాత్రం పది నెలలుగా అంతుపట్టడం లేదు.

### హంతకులను పట్టుకుంటాం

శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో విచారణ కొనసాగుతుంది. హత్య సందర్భంలో అందుబాటులో ఉన్న పరిస్థితులను పరిగణలోకి తీసుకున్నాం. సాధారణ విచారణలో పక్కా సమాచారం రాలేదు. ఇంకా సరైన వాస్తవాల కోసం సాంకేతికంగా ఫోరెన్సిక్ విధానాల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నాం. కేసు విచారణ డీలా అన్నట్లు కనిపిస్తున్నా.. తగిన ఆధారాల కోసమే చర్యలు కొనసాగుతున్నాయి. కొంత ఆలస్యమవుతున్నా త్వరలోనే హంతకులను పట్టుకుంటాం. **- కృష్ణ, సీఐ, వనపర్తి జిల్లా**

## రిలయన్స్ మార్ట్ తనిఖీ

- కుళ్లిన పదార్థాలు స్వాధీనం చేసుకున్న అధికారులు
- ఎక్స్‌పైర్ అయిన వస్తువులు

వననర్తి, మార్చి 21(నమస్తే తెలంగాణ) : వనపర్తిలోని రిలయన్స్ మార్ట్‌పై ఆహార భద్రత అధికారులు, మున్సిపల్, హెల్త్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు చేశారు. పిజ్జా, బర్గర్‌లు కుళ్లిపోయాయని వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలను చేపట్టారు. అయితే.. తనిఖీల్లో చాలా వరకు పిజ్జాలు, బర్గర్లు కుళ్లినవి దొరికాయి. అలాగే పండ్లు కుళ్లిపోగా, మరికొన్ని ఆహార వస్తువులు గడువు తీరిన వస్తువులు అధికంగా బయటపడ్డాయి. మార్ట్‌కు వెళ్లే ప్రజలు అనేక పర్యాయాలు ఫిర్యాదు చేయలన్నా కనీసం ఫిర్యాదుల పుస్తకం కూడా అందుబాటులో ఉండదని, మార్ట్‌కు వచ్చే వినియోగదారులను నిర్లక్ష్యంగా చూస్తారని, సక్రమంగా లేని సరుకులపై ప్రశ్నించినా ఏమాత్రం స్పందన ఉండదని పలువురు తనిఖీకి వచ్చిన అధికారులకు వెల్లడించారు. అయితే, కుళ్లిన పదార్థాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని, వచ్చే రిపోర్టుల ఆధారంగా షాపింగ్ మాల్‌పై చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారిణి నీలిమ చెప్పారు. కాగా జిల్లాలో అస్తవ్యస్తంగా మాల్స్, హోటళ్లు ఇతర వ్యాపార సముదాయలు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదని, ప్రజలు పిర్యాదులు చేస్తే తప్పా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. ఇదిలా ఉంటే, తనిఖీలు చేసిన రెండు గంటల అనంతరం మళ్లీ యథావిధిగా రిలయన్స్ మార్ట్ తెరుచుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి.